సాక్షి
ఏలూరు

శనివారం । 4 । మే । 2024





ఉప్పొంగిన ఉత్సాహం.. జేజేలు పలుకుతూ



జన కెరటం: నరసాపురంలోని స్టీమర్ రోడ్డులో సీఎం జగన్ ప్రచార సభకు హాజరైన జన సందోహంలో ఓ భాగం

నరసాపురం..

విజయం మనదే.. నరసాపురం స్టీమర్ రోడ్డులో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఫ్యాన్ గుర్తును చూపిస్తూ ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అభిమాన సంద్రం

తీరం పోటెత్తిందా.. గోదావరి ఉప్పొంగిందా అన్నట్టు నరసాపురం జన సునామీని తలపించింది.. జై జగన్.. జయహో జగన్ నినాదాలతో హోరెత్తింది.. తమ అభిమాన నేతను చూసేందుకు.. సంక్షేమ సారథికి మద్దతు ఇచ్చేందుకు ప్రజలు అశేషంగా తరలివచ్చారు.. మండుటెండలోనూ సీఎం జగన్ కోసం వేచి ఉన్నారు.. ఆయన ప్రసంగానికి ఆద్యంతం జయజయధ్వానాలు పలికారు. కూటమి నేతలను తిప్పికొడతామంటూ నినాదాలు చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం నరసాపురం స్టీమర్ రోడ్డులో నిర్వహించిన ప్రచార సభకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు.

జయజయధ్వానాలు

- సీఎం జగన్‌కు ప్రజలు బ్రహ్మరథం
- మండుటెండనూ లెక్కచేయని వైనం
- స్టీమర్ రోడ్డులో సభకు పోటెత్తిన జనం
- కూటమిని తిప్పికొడతామంటూ మద్దతు

సాక్షి, భీమవరం: నరసాపురంలోని స్టీమర్ రోడ్డులో వైఎస్సార్‌సీపీ ఏర్పాటుచేసిన బహిరంగ సభకు జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చారు. ఎటుచూసినా జన సమూహంతో పండగ వాతావరణం కనిపించింది. ఉదయం 10.30 గంటలకు సభ కాగా 8 గంటల నుంచే నరసాపురం, పరిసర నియోజకవర్గాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చేరుకోవడం కనిపించింది. చెంతకు వస్తున్న అభిమాన నేతను చూసేందుకు చిన్నాపెద్దా తేడాలేకుండా వృద్ధులు, మహిళలు, యువత, చిన్నారులు సభకు పోటెత్తారు. తీన్‌మార్ వాయిద్యాలు, మోటార్ సైకిల్ ర్యాలీలతో యువత హోరెత్తించారు. నిర్ణీత సమయానికి స్టీమర్ రోడ్డులోని సభాప్రాంగణం అంతా జనంతో నిండిపోయింది. వెల్లువలా తరలివచ్చిన జనాన్ని కట్టడి చేసేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.

మండుటెండనూ లెక్కచేయక..

ఉదయం 8 గంటల నుంచే సూర్యుడు ప్రతాపం చూపించడం ప్రారంభించాడు. ఉక్కపోతతో చెమటలు కారుతున్నా, ఎండ తీవ్రత తాళలేకున్నా అభిమాన నేత రాక కోసం ప్రజలు బారులుతీరి ఎదురుచూశారు. గంటన్నర పాటు సీఎం జగన్ రాక ఆలస్యమైనా అంతటి మండుటెండలోనూ చెక్కుచెదరకుండా వేచి ఉండటం విశేషం. వైఎస్సార్‌సీపీ గీతాలకు జెండాలు ఊపుతూ యువత నృత్యాలు చేస్తూ అందరిలో ఉత్సాహం నింపారు. ప్రచార రథం పక్కనే ఆస్పత్రి భవనం వద్ద ప్రచార గీతాలకు లయబద్ధంగా యువతి చేసిన నృత్యం చూసి పార్టీ నేతలు అభివాదం చేస్తూ అభినందించారు. ఉదయం 11.40 గంటల సమయంలో సభా ప్రాంగణం మీదుగా టేలర్ హైస్కూల్ గ్రౌండ్‌లోని హెలీప్యాడ్‌కు చేరుకుంటున్న సీఎం జగన్ హెలికాప్టర్‌ను చూసి చేతులు ఊపుతూ ప్రజలు స్వాగతం పలికారు. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కోసం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు పార్టీ శ్రేణుల ద్వారా సభలోని వారికి విరామం లేకుండా మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లు అందించారు. ఉదయం 11.55 గంటల సమయంలో సీఎం జగన్ కాన్వాయ్‌లో సభా ప్రాంగణానికి చేరుకున్నారు. పార్టీ శ్రేణులు, యువకులు కాన్వాయ్ వెంట ర్యాలీగా వచ్చారు. సభలోని వారికి బస్సులోంచి చేతులు ఊపుతూ సీఎం జగన్ సభాస్థలిలోని ప్రచారం రథంపైకి చేరుకున్నారు.

అలసటను దూరం చేసిన ఆప్యాయత

'నరసాపురం సిద్ధమా?.. సమయం 12.15 మిట్ట మధ్యాహ్నం. ఇంతటి ఎండలో ఏమాత్రం కూడా ఎండను ఖాతరు చేయకుండా చిక్కటి చిరునవ్వుల మధ్య ఇంతటి ప్రేమానురాగాలు, ఆప్యాయతలు, ఆత్మీయతలు పంచుతున్న నా ప్రతి అక్కకూ, ప్రతి చెల్లెమ్మకూ, ప్రతి అవ్వకూ, ప్రతి తాతకూ, ప్రతి సోదరుడికీ, ప్రతి స్నేహితుడికీ.. మీ అందరి ఆప్యాయతలకు మీ బిడ్డ, మీ జగన్ రెండు చేతులు జోడించి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాడు..' అంటూ ప్రసంగం ప్రారంభంలో సీఎం జగన్ చెప్పిన మాటలు అప్పటివరకు ప్రజలు పడిన అలసటను దూరం చేశాయి.

సీఎం జగన్ ప్రసంగంతో నయా జోష్

దాదాపు అరగంట పాటు సాగిన సీఎం జగన్ ప్రసంగం ఆద్యంతం ప్రజల్లో ఉత్సాహం నింపింది. జై జగన్.. సీఎం.. సీఎం అంటూ సభా ప్రాంగణమంతా నినాదాలతో హోరెత్తింది. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేశానని ఈ పెద్దమనిషి అంటుంటాడు, ఆయన పాలనలో ఏనాడైనా ఇన్ని స్కీములు ఇచ్చాడా? ఇప్పటి మాదిరిగా ఏనాడైనా అవ్వాతాతలకు ఇంటింటికీ పింఛన్ ఇచ్చాడా? రైతు రుణమాఫీ చేస్తానన్నాడు.. చేశాడా? ఈ పెద్దమనిషి చంద్రబాబు పేరు చెబితే పేదలకు చేసిన కనీసం ఒక్కటంటే ఒక్క స్కీమ్ అయినా గుర్తుకు వస్తుందా? అంటూ ముఖ్యమంత్రి అడిగిన ప్రశ్నలకు లేదూ.. లేదూ.. అంటూ రెండు చేతులు ఊపుతూ ప్రజలు మద్దతు తెలిపారు. ఈ ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో తెచ్చిన పథకాలు గురించి వివరిస్తున్నప్పుడు అవునూ.. అవునూ.. అంటూ ప్రజలు పెద్దఎత్తున మద్దతు పలికారు.



మన అభ్యర్థులు వీరే.. మద్దతివ్వండి.. వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు గూడూరి ఉమాబాల, ముదునూరి ప్రసాదరాజుకు ఓటేయాలని కోరుతున్న సీఎం జగన్



అక్కచెల్లెమ్మల అభిమానం.. సీఎం జగన్ కాన్వాయ్‌ని చూసి జేజేలు పలుకుతున్న మహిళలు

కనీవినీ ఎరుగని అభివృద్ధి



నరసాపురం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు

రాష్ట్రంలో వినూత్న పాలనను సీఎం జగన్ మన ముందుకు తెచ్చారు. గతంలో దళారులు, అవినీతి, పక్షపాతం వల్ల పథకాలన్నీ కొందరు జేబుల్లోకే వెళ్లిన పరిస్థితి. కానీ ఈ ఐదేళ్లలో వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రతి ఇంటికీ నేరుగా సంక్షేమ ఫలాలను పారదర్శకంగా అందించాం. నరసాపురం నియోజకవర్గంలో కనీవినీ ఎరుగని అభివృద్ధి చేశాం. ఆర్టీసీ బస్టాండ్, వంద పడకల ఏరియా ఆస్పత్రి, కాటన్ పార్క్, ఆక్వావర్సిటీ తదితర ఎన్నో అభివృద్ధి పనులు చేశాం. బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్, వశిష్ట గోదావరిపై వంతెన పనులకు మోక్షం కలిగించాం. రానున్న ఐదేళ్లలో మరిన్ని అభివృద్ధి పనులు చేస్తాం.

ప్రజల జీవితాల్లో ఎంతో మార్పు



ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల

జగన్ ముఖ్యమంత్రి అయ్యాక రాజకీయాలతో పాటు ప్రజల జీవితాల్లో ఎంతో మార్పు వచ్చింది. గతంలో ఎవరూ సీఎం జగన్‌లా ప్రజలకు సంక్షేమాన్ని అందించలేక పోయారు. గతంలో రాజకీయాలు అంటే ధనబలం ఉన్న వ్యక్తులకు మాత్రమే పరిమితం అయ్యేవి. తొలిసారి సీఎం జగన్ పాలనలో బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు వచ్చాయి. ఓసీలు మాత్రమే పోటీ చేసే నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ స్థానాన్ని మొదటిసారిగా బీసీలకు అవకాశం ఇచ్చిన జగనన్నకు కృతజ్ఞతలు.

సామాన్యులకూ సీట్లు



పాలకొల్లు ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి)

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం మేర అమలుచేశారు. నవరత్నాలతో పాటు నవరత్నాల ప్లస్‌ను మనమంతా అందుకునేందుకు సిద్ధంగా ఉన్నాం. ఎన్నడూ లేనివిధంగా అతి సామాన్యులకూ సీట్లు కేటాయించిన గొప్ప వ్యక్తి సీఎం జగన్. మనమంతా కష్టపడి పార్టీ కోసం పనిచేసి సీఎం జగన్‌ని మరలా ముఖ్యమంత్రిని చేసుకోవాలి. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలను, ఒక ఎంపీ స్థానాన్ని గెలుచుకుని సీఎం జగన్‌కు బహుమతిగా ఇవ్వాలి.

కూటమి మేనిఫెస్టో బూటకం



ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్

ప్రతిపక్ష పార్టీ విడుదల చేసిన మేనిఫెస్టో అంతా అబద్ధాల పుట్ట. బడ్జెట్‌కు సరిపోల్చని, ఆచరణ సాధ్యం కాని హామీలను ఇస్తున్నారు. కానీ సీఎం జగన్ మాట ఇచ్చారంటే అమలుచేసి చూపిస్తారన్న విషయం అందరికీ తెలుసు. నరసాపురంలో బస్టాండ్‌ను అభివృద్ధి చేశారు, 100 పడకల ఆస్పత్రిని అందుబాటులోకి తెచ్చారు. కాపునేస్తం ద్వారా మహిళలకు ఆర్థిక భరోసా కల్పించారు. ఇలా అన్నివర్గాలను అభివృద్ధిలోకి తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుంది.

మా నమ్మకం నువ్వే జగన్.. ఓ యువకుడి ఉత్సాహం





మేమంతా మీవెంటే.. సీఎం జగన్ కాన్వాయ్‌ని చూసి చేతులు ఊపుతూ జేజేలు పలుకుతున్న మహిళలు ←

క్లుప్తంగా

తొలిరోజు 579 మంది ఓటేశారు



ప్రత్యేక పోలింగ్ కంపార్ట్‌మెంట్ ద్వారా ఓటు వేస్తున్న వృద్ధురాలు

ఏలూరు (మెట్రో): దేశంలోనే తొలిసారిగా ఇంటి వద్దే ఓటు వేసే అవకాశాన్ని కల్పించిన క్రమంలో ఏలూరు జిల్లాలో శుక్రవారం హోం ఓటింగ్ విజయవంతంగా ప్రారంభమైంది. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి 85 సంవత్సరాలు పైబడిన వారు, 40 శాతం కన్నా ఎక్కువ వైకల్యం ఉన్న వారికి ఎన్నికల సంఘం హోమ్ ఓటింగ్ సౌకర్యాన్ని కల్పించింది. దీనిలో భాగంగా తొలిరోజు శుక్రవారం జిల్లాలో 579 మంది హోం ఓటింగ్ వినియోగించుకోగా, పోలవరం నియోజకవర్గంలో 90 మంది, ఉంగుటూరులో 113, ఏలూరులో 54, చింతలపూడిలో 63, దెందులూరులో 87, కైకలూరులో 113, నూజివీడులో 59 మంది ఓటు వేశారు. పోలింగ్ అధికారులు, వీడియోగ్రాఫర్ సమక్షంలో ఓటింగ్ ప్రక్రియ జరిగింది.

10 నుంచి శ్రీవారి సేవా రుసుముల పెంపు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలో జరిగే నిత్య సేవలలో ముఖ్యమైన మూడు రకాల సేవల రుసుములను పెంచినట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం రూ.200లుగా ఉన్న సుప్రభాత సేవా టికెట్ రుసుము రూ.300లకు, అష్టోత్తర శతనామార్చన టికెట్ రుసుము రూ.300 నుంచి రూ.500లకు, దీపారాధన సేవా టికెట్‌ను రూ.10 నుంచి రూ.20లకు పెంచినట్టు చెప్పారు. పెరిగిన ధరలు ఈనెల 10 నుంచి అమలులోకి వస్తాయని, భక్తులు గమనించాలని ఈఓ కోరారు.

10 నుంచి కాలువలకు నీటి విడుదల బంద్

ఏలూరు (మెట్రో): గోదావరి డెల్టా పరిధిలోని ప్రధాన కాలువలకు నీటి విడుదలను ఈ నెల 10వ తేదీ నుంచి నిలిపివేస్తున్నట్లు ధవళేశ్వరం, గోదావరి డెల్టా సిస్టం చీఫ్ ఇంజనీర్ సతీష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరి తూర్పు, మధ్యమ, పశ్చిమ డెల్టా ప్రధాన కాలువల పరిధిలో సాగు, తాగునీటి అవసరాలకు సరిపడా ఇప్పటికే పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేశామన్నారు. ఈ నెల 10వ తేదీ సాయంత్రం ఆరు గంటల నుంచి కాలువలకు నీటిసరఫరా నిలిపివేయాలని నిర్ణయించామన్నారు.



నూజివీడు ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచిలో పింఛను కోసం బారులు తీరిన లబ్ధిదారులు



నూజివీడు యూనియన్ బ్యాంకులో పింఛన్ సొమ్ము తీసుకునేందుకు వచ్చిన లబ్ధిదారులు

పండుటాకులు విలవిల

'ముసలోళ్లను ముప్పతిప్పలు పెడుతున్నావు.. మా ఉసురు నీకు తగులుతుంది.. మామీద ఎందుకు నీకు ఇంత పగ.. ఆ దేవుడే నీకు శిక్ష వేస్తాడు' అంటూ అవ్వాతాతలు చంద్రబాబును శాపనార్థాలు పెడుతున్నారు. జగన్ బాబు ఇంటి గుమ్మంలోకే పింఛను ఇచ్చారని, చంద్రబాబు ముసలోళ్లను ఇబ్బందులు పెట్టాలనే ఉద్దేశంతో ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు చేసి తమను రోడ్డుపాలు చేశాడంటూ అవ్వాతాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడో తేదీ వచ్చినా ఇంకా పింఛను చేతికి అందక బ్యాంకుల వద్ద పడిగాపులు కాయాల్సి రావడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. శుక్రవారం జిల్లాలోని పలు బ్యాంకుల వద్ద అవ్వాతాతలు పింఛను సొమ్ము కోసం మండుటెండలో నిరీక్షిస్తూ అష్టకష్టాలు పడుతూ ఇలా విలవిల్లాడుతూ కనిపించారు.



కామవరపుకోట యూనియన్ బ్యాంకులో పింఛను కోసం బారులు తీరిన లబ్ధిదారులు

విలపింఛెన్

- చంద్రబాబు వగబట్టాడంటున్న అవ్వాతాతలు
- తమ ఉసురు తగులుతుందంటూ శాపనార్థాలు
- వృద్ధులు, దివ్యాంగులు, మహిళలకు తప్పని అవస్థలు
- మండుటెండలో బ్యాంకుల వద్ద గంటల తరబడి పడిగాపులు
- కేవైసీ, ఆధార్ అప్‌డేట్ లేక ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు

ఏలూరు (మెట్రో)/నూజివీడు/కామవరపుకోట/జంగారెడ్డిగూడెం : ప్రతి నెలా ఒకటో తేదీనే తెలవారకముందే ఇంటి వద్దే ఠంచన్‌గా వలంటీర్ల ద్వారా పింఛను సొమ్ము అందుకునే అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులు ఇప్పుడు తమను రోడ్డు పాలు చేశారంటూ ప్రతిపక్ష పార్టీలను దుమ్మెత్తిపోస్తున్నారు. శుక్రవారం జిల్లాలోని పలు బ్యాంకుల వద్ద పింఛను సొమ్ము కోసం గంటల తరబడి పడిగాపులు పడుతూ పింఛను లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అధికారులు బ్యాంకులో వేసిన సొమ్ములను ఎలా తీసుకోవాలో తెలియక బ్యాంకులో కనిపించిన వారిని డబ్బుతీసిపెట్టండంటూ ప్రాధేయపడ్డారు. వలంటీర్ల వ్యవస్థ ఏర్పడిన నాటి నుంచి టీడీపీ, జనసేన అధినాయకులు చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ చులకన భావంతో వలంటీర్ల వ్యవస్థపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఇటువంటి తరుణంలోనే దేశవ్యాప్తంగా వలంటీర్ల వ్యవస్థకు ప్రశంసలు లభించడంతోపాటు ప్రభుత్వానికి మంచి పేరు వచ్చింది. ఎన్నికల సమయంలో కోర్టుల్లో కేసులు వేయించడం ద్వారా చంద్రబాబునాయుడు వలంటీర్ల సేవలను అడ్డుకున్నారు. దీంతో ఇంటి వద్దే పింఛను పొందే లబ్ధిదారులకు అవస్థలు ప్రారంభమయ్యాయి. గత నెలలో సచివాలయాల వద్ద పంపిణీ చేయగా, ఈ నెల బ్యాంకు ఖాతాల్లో పింఛను జమ చేశారు.



మనమడు సాయంతో పింఛన్ తీసుకునేందుకు బ్యాంకు వద్దకు వచ్చిన ఓ వృద్ధుడు



బ్యాంకుకు వెళ్లేందుకు ఆటో కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు

మండుటెండలో..

పింఛను సొమ్ము బ్యాంకు ఖాతాలకు జమ చేయడంతో ఈ నెల 1వ తేదీ నుంచి వృద్ధులు, విలాంగులు, ఒంటరి మహిళలు బ్యాంకుల చుట్టూ తిరగక తప్పలేదు. ఎండతీవ్రత, వడగాల్పులు అధికంగా ఉన్నా పింఛను సొమ్ము చేతికి అందకపోతే పూట గడిచేదెలా, మందులు కొనుక్కునేది ఎలా అంటూ ఉదయాన్నే బ్యాంకుల వద్ద క్యూలు కడుతున్నారు. ప్రధానంగా బ్యాంకు సౌకర్యం లేని గ్రామాల ప్రజలు దూరప్రాంతాలకు వెళ్లడం మరింత ఇబ్బందికర పరిస్థితిలో వ్యయప్రయాసలకు గురవుతున్నారు. చాలా చోట్ల బ్యాంకుల్లో నిరీక్షించేందుకు కూడా జాగా లేక బ్యాంక్ కార్యాలయాల బయటే అవ్వాతాతలు నిలబడి ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది

బ్యాంక్ ఖాతాలు యాక్టివ్‌గా లేక..

జిల్లాలో బ్యాంకులకు 2,54,029 మందికి చెందిన పెన్షన్ల సొమ్మును డిపాజిట్ చేయగా, వాటిలో కనీసం 50 శాతం మంది ఇప్పటికి పెన్షన్‌లు తీసుకోలేకపోయారు. జిల్లాలో 35 ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులకు సంబంధించిన 301 శాఖలు ఉన్నాయి. పింఛనుదారుల్లో చాలా మంది బ్యాంక్ ఖాతాలు యాక్టివ్‌లో లేక, ఆధార్ కార్డు అప్‌డేట్ కాలేదనో, పింఛను పడిందో లేదో తెలియక లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. పింఛన్ సొమ్ము బ్యాంకులో జమ అయినా అవి తీసుకునేందుకు ఖాతాలు యాక్టివ్‌లో లేకపోవడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. గత ప్రభుత్వ కాలంలో పడిన కష్టాలు ఐదేళ్ల తరువాత మళ్లీ మొదలయ్యాయి అంటూ అవ్వాతాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నెల సచివాలయాల చుట్టూ తిరగాల్సి వస్తే, ఈ సారి బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోయారు.



జంగారెడ్డిగూడెం యూనియన్ బ్యాంకులో పింఛన్ కోసం బారులు తీరిన లబ్ధిదారులు

టీడీపీ నాయకుల వల్లే ఈ దుస్థితి



టీడీపీ నాయకుల నీచమైన చర్యతో పింఛను తీసుకోవడానికి, తీవ్రమైన ఎండలో బ్యాంకులు చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడింది. బ్యాంకులు రద్దీగా ఉండటంతో ఇక్కడ నిలబడలేక ఇంటికి తిరిగి వెళుతున్నా. ఆర్థికంగా చాలా ఇబ్బందిగా ఉంది. దీనికి టీడీపీ నాయకులే కారణం.

– వై.ఏసుబాబు, కామవరపుకోట, వై. కాలనీ

మా ఉసురు తగులుతుంది



ప్రతినెలా వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చేవారు. పింఛను సొమ్ముతో మందులు, నిత్యావసరాలు కొనుక్కునే దాన్ని. మూడో తేదీ వచ్చినా ఇంకా పింఛను అందలేదు. నా పింఛన్ సొమ్ము ఏ బ్యాంకులో వేశారో తెలియక, కాగితాలు పట్టుకుని మూడు రోజుల నుంచి మండుటెండలో బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా. మాకు వలంటీర్ ద్వారా పింఛను ఇప్పించాలి. వృద్ధులను ఇబ్బంది పెట్టిన టీడీపీ నాయకులకు మా ఉసురు కచ్చితంగా తగులుతుంది.

– దారిమిల్లి కన్నమ్మ, వృద్ధురాలు, కామవరపుకోట

ఎండలో నడుచుకుంటూ వచ్చా



పింఛన్ సొమ్ము తీసుకునేందుకు ఎండలో నడుచుకుంటూ బ్యాంకుకు వచ్చాను. ఇక్కడ చాలా క్యూలైన్ ఉంది. తీరా కౌంటర్ వద్దకు వెళ్లేటప్పటికి నా ఖాతా మనుగడలో లేదని, దానిని పునరుద్ధరించాల్సి ఉందని, సోమవారం మళ్లీ రావాలని బ్యాంకు అధికారులు చెప్పారు. బ్యాంకులో పింఛన్ సొమ్ము ఉన్నా, తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది. చంద్రబాబు పుణ్యమా అంటూ రెండు నెలలుగా డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నా.

– ఎం.మాణిక్యం, పింఛన్ లబ్ధిదారు, ఉప్పలమెట్ట, జంగారెడ్డిగూడెం

అనుమానాస్పద స్థితిలో బాలుడి మృతి



ఇంటిపక్కన పడి ఉన్న మృతదేహం



యశ్వంత్ నవీన్‌రెడ్డి (ఫైల్)

నూజివీడు: పట్టణంలోని జంక్షన్ రోడ్డులో ఓ బాలుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని అమరావతి ఫర్నిచర్స్ యజమాని అయిన కొవ్వూరు రామారెడ్డికి ఇద్దరు కుమారులు. వీరిద్దరూ గురువారం రాత్రి ఇంట్లో ఒకే బెడ్‌రూమ్‌లో నిద్రించారు. అయితే తెల్లారేసరికి చిన్న కుమారుడు కొవ్వూరు యశ్వంత్ నవీన్‌రెడ్డి (15) మృతదేహం ఇంటి పక్కన పడి ఉండటాన్ని శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో గుర్తించారు. మృతుడు యశ్వంత్ నవీన్‌రెడ్డి ఇటీవలే 542 మార్కులతో పదో తరగతి ఉత్తీర్ణుడయ్యాడు. తండ్రి ఫిర్యాదు మేరకు సీఐ వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అలాగే ఏలూరు నుంచి వచ్చిన క్లూస్ టీం సాక్ష్యాధారాలను సేకరించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

యానాం మద్యం స్వాధీనం.. వ్యక్తి అరెస్టు

నూజివీడు : యానాం మద్యంను ద్విచక్రవాహనంపై తరలిస్తున్న వ్యక్తిని ఎస్ఈబీ నూజివీడు స్టేషన్ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. ఇన్స్‌పెక్టర్ వెంకటరమణ మీర్జాపురంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా బాపులపాడు మండలం పాత మల్లవల్లికి చెందిన బొల్లిగర్ల కోటేశ్వరరావు ద్విచక్ర వాహనంపై యానాంకు చెందిన 36 మద్యం ఫుల్‌బాటిళ్లను తీసుకెళుతుండగా అతనిని అదుపులోకి తీసుకుని మద్యం బాటిళ్లను, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. సాధీనం చేసుకున్న వాటిలో మాన్షన్‌హౌస్ బ్రాందీ సీసాలు 24, రాయల్‌స్టాగ్ సీసాలు 12 ఉన్నాయి. వీటి విలువ మొత్తం రూ.19 వేలు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టుకు తరలించినట్లు పేర్కొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు విజయవంతం చేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): యూటీఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవ సంబరాలను విజయవంతం చేయాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు కోరారు. ఏలూరు జిల్లా కార్యవర్గ సమావేశం శుక్రవారం జిల్లా అధ్యక్షులు షేక్ ముస్తాఫా అలీ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం జిల్లాలో పదవ తరగతి పరీక్షల్లో ఉన్నత ఫలితాలు సాధించిన విద్యార్థులను సత్కరించారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రాక్షి రవికుమార్ విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. వీరికి ఏ విధమైన సహాయం అవసరమైనా అండగా ఉంటామని భరోసానిచ్చారు. రాష్ట్ర కార్యదర్శులు బీ.సుభాషిణి, ఎస్. కిషోర్ కుమార్ జిల్లా కార్యదర్శులు పీవీ సాగర్ బాబు ఎస్. సుధారాణి పాల్గొన్నారు.

ఎర్రకాలువలో పడి వ్యక్తి మృతి



సత్యనారాయణ మృతదేహం

కొయ్యలగూడెం: ఎర్రకాలువలో పడి ఒక యువకుడు మృతి చెందాడు. రాజవరం సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పోతిన సత్యనారాయణ (44) అనే వ్యక్తి పొలం పనులు నిమిత్తం ఉదయం వెళ్ళాడు. రాజవరం వద్ద ఎర్రకాలువ దాటే సమయంలో గుండంలో పడి ప్రాణాలు కోల్పోయాడు. నీటి గుండంలో తేలియాడుతున్న శవాన్ని స్థానిక రైతుల మధ్యాహ్నం గుర్తించి బయటికి తీసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. రెవెన్యూ అధికారులు విచారణ నిర్వహించినట్లు సర్పంచ్ పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు

టీడీపీ, జనసేన పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



ఆళ్ల నాని సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన 49వ డివిజన్ టీడీపీ నాయకులు, కార్యకర్తలు

నూజివీడు: అమలుకు సాధ్యం కాని మోసపూరిత హామీలు ఇచ్చి రాష్ట్ర ప్రజలను మోసం చేయాలని చూస్తున్నాడని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి వైఎస్సార్‌సీపీని రాబోయే ఎన్నికల్లో గెలిపించాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తనయుడు మేకా వేణుగోపాల అప్పారావు(చంటినాయన) అన్నారు. ముసునూరు మండలం గోగులంపాడు కొత్తూరుకు చెందిన టీడీపీ మాజీ ఎంపీటీసీ గంగుల పంగిడయ్య ఆధ్వర్యంలో 100 కుటుంబాలు గురువారం అర్ధరాత్రి చంటినాయన సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. పల్లగాని రంగారావు, ఆకుల వెంకట్రావు, నల్లిబోయిన గోపి, తాళ్ల శివనాగరాజు, సాయల శివయ్య, జోనుబోయిన వెంకటేశ్వరరావు, గంగుల రాజగోపాల్, పాలా వడ్డీకాసులు, పటాపంచల గోపాలస్వామి, చిన్ను శివనాగరాజు తదితరులు చేరారు. వీరందరికి చంటినాయన పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



చంటినాయన సమక్షంలో పార్టీలో చేరిన గోగులంపాడు కొత్తూరు టీడీపీ నాయకులు, కార్యకర్తలు

వాసుబాబు సమక్షంలో జనసేన కార్యకర్తల చేరిక

నిడమర్రు/గణపవరం: బువ్వనపల్లి, గణపవరం గ్రామాల్లోని జనసేనకు చెందిన 100 మంది కార్యకర్తలు శుక్రవారం బువ్వనపల్లి గ్రామంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో శుక్రవారం వైఎస్సార్ సీపీలోకి చేరారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి సంకు నాగేషు ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. వీరిని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పార్టీ కండువాతో సాదరంగా వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో సంకు ఏసుబాబు, చోడవరపు హరి ప్రసాద్, చేగొండి మహేంద్ర, ఎల్‌వీఎస్ ప్రకాష్, దూలం రాధాకృష్ణ, పిల్లా సాయిరామకృష్ణ, సంకు యశ్వంత్, స్వామి, కాస్యం బీబీ, ఆళ్ల దానీదుర్గ, సంకు చంద్రకళ తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పుప్పాల మేరీ, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాన్వెంట్ శ్రీను, సర్పంచ్ కిలారి సత్యవతి రవి, ఉప సర్పంచ్ వెల్లంకి నరేష్, కొట్టు నరేష్, సంకు శ్రీను, సంకు కొండలరావు నాయుడు తదితరులున్నారు.



బొద్దనపల్లిలో ఎమ్మెల్యే ప్రతాప్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు

ఆళ్లనాని సమక్షంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల చేరిక

ఏలూరు (టూటౌన్): నగరంలోని 49వ డివిజన్‌కు చెందిన 50 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు పరసా శశిధర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. శ్రీరామ్ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వీరందరికీ ఎమ్మెల్యే ఆళ్ల నాని వైఎస్సార్ సీపీ కండువాలను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ ఒకటో డివిజన్ నాయకులు బోడ దుర్గారావు, ఆరేపల్లి సత్తిబాబు ఆధ్వర్యంలో వీరు పార్టీలోకి చేరారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని మాట్లాడుతూ చంద్రబాబు కూటమి కుట్రలు తిప్పికొట్టి వైఎస్సార్ సీపీని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యే ప్రతాప్ సమక్షంలో..

ఆగిరిపల్లి: మండలంలోని బొద్దనపల్లికి చెందిన 10 కుటుంబాలు వారు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షుడు నక్కిన బోయిన సాంబశివరావు, ఒకటో వార్డు సభ్యుడు దొడ్ల నాగయ్య, చాగంటిపాటి శ్రీను, కందుల శ్రీనివాసరావుతో పాటు పలువురు టీడీపీ కార్యకర్తలకు ఎమ్మెల్యే ప్రతాప్ కండువాలు కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ సీపీ మండల అధ్యక్షులు పల్లగాని నరసింహారావు, జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు, గోళ్ళ ఇస్సాకు పీఏసీఎస్ అధ్యక్షులు బోయపాటి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు రావి విష్ణువర్ధన్‌రావు, డీవీ రామారావు, గ్రామ పార్టీ అధ్యక్షులు మల్లవల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాజకీయ ప్రకటనలకు అనుమతి తప్పనిసరి

కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్



ఏలూరు (మెట్రో): పోలింగ్ రోజు, పోలింగ్‌కు ముందు రోజు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, వెబ్ మీడియాలో ప్రచురించే రాజకీయ ప్రకటనలకు ఎంసీఎంసీ కమిటీ ముందస్తు అనుమతి తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ సూచించారు. అనుమతులు లేకుండా ఎలాంటి రాజకీయ ప్రకటనలను ప్రచురించరాదన్నారు. ఎన్నికల సందర్భంగా ఆవేశపూరితమైన, తప్పుదోవ పట్టించే లేదా ద్వేషపూరిత ప్రకటనల కారణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు ఎన్నికల సంఘం చర్యలు చేపట్టిందన్నారు. జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు, వార్తాపత్రికలు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని రాజకీయ ప్రకటనల విషయంలో ఎలక్షన్ కమిషన్‌కు సహకరించాలని కోరారు.

మాకు అన్ని పథకాలూ అందాయి



జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాలతో మా కుటుంబం ఎంతో ఆనందంగా ఉంది. ఇంటి స్థలం, డ్వాక్రా రుణమాఫీ, అమ్మఒడి, చేయూత, రైతు భరోసా, పంటల బీమా ఇలా మా కుటుంబానికి అన్ని పథకాలు అందాయి. ఏ ప్రభుత్వం చేయలేని సంక్షేమం, అభివృద్ధి జగనన్న చేశాడు. జగనన్న మళ్లీ వస్తే మాలాంటి కుటుంబాల్లో మరింత సంతోషం వెల్లివిరుస్తుంది.

– డి రాధ, మల్లవరం

జగన్‌ను చూశాకే ఇంటికి వెళతా



మొన్నటి వరకూ ఇంటికి వచ్చి పెన్షన్ ఇచ్చేవారు. గత నెల, ఈ నెల పెన్షన్ తీసుకోవడానికి సచివాలయానికి, బ్యాంకుకు వెళ్లాల్సి వచ్చింది. జగన్‌బాబు వస్తేనే మళ్లీ మాకు పెన్షన్లు ఇంటికి వస్తాయి. పథకాలను ఇంటింటికి అందించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నరసాపురం వస్తున్నారనే తెలిసి ఉదయాన్నే బయలుదేరి వచ్చాను. జగన్‌బాబును చూసిన తరువాతే ఇంటికి వెళతా.

– లంకా పద్మ, లక్ష్మణేశ్వరం

జగన్ పాలనలో అవినీతి లేదు



మా కుటుంబంలో చేయూత వస్తుంది, నాకు పెన్షన్ వస్తుంది. గత ఐదేళ్లుగా మా కుటుంబంలో అనేక పథకాలు అందుకుంటు న్నాము. గతంలో ఏ పథకం కావాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగేవాళ్లం. ఏదైనా పథకం అందాలంటే వాటిలో సగం వారికి ముట్టజెప్పాల్సి వచ్చేది. జగన్‌బాబు ప్రభుత్వంలో ఎక్కడా అవినీతి లేకుండా ఇంటికి వచ్చి పథకాలు అందజేస్తున్నారు.

– బాలం సత్యవతి, లక్ష్మణేశ్వరం, జోనా నగర్


జగనన్నను చూడాలని వచ్చా



మా అమ్మాయికి సొంతింటి కల నెరవేరింది. **నాకు పెన్షన్** వస్తుంది. అమ్మఒడి పథకం అందుతుంది. తద్వారా **మా మనవ** ళ్లకు మెరుగైన విద్య అందుతుంది. పిల్లల చదువు**కు రూపాయి** కూడా ఖర్చు లేకుండానే విద్య కొనసాగుతుంది. ప్ర**జలకు ఇంత** మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగనన్నను చూడాల**ని ఇక్కడకు** వచ్చాను.

– శీలంకి పార్వతి, **నరసాపురం**

ఎంతసేపైనా ఎదురుచూస్తా



జగన్‌బాబు వల్ల అన్ని కుటుంబాలు బాగున్నాయి. మంచి పరిపాలన అందిస్తున్నాడు. ఇంత సంక్షేమాన్ని అందిస్తున్న జగన్‌ను చూడాలని 20 కిలోమీటర్ల దూరంనుంచి ఎండలో వచ్చాను. ఎంత టైం అయినా, ఎంత వేడైనా జగన్‌ను కనులారా చూసే వెళతాను. ఆయన వల్లే నాకు పింఛన్ వస్తుంది. ఇంటామెకు డ్వాక్రా రుణం అందింది. మనవడికి అమ్మ ఒడి డబ్బులు వస్తున్నాయి.

– పెంటపాటి సత్యనారాయణ, పేరుపాలెం


ఓటుతో అండగా నిలుస్తాం



మా లాంటి యువతకు జగనన్న ఒక బ్రాండు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాలు, అన్ని వర్ణాలను కలుపుకుని మాలాంటి యువతకు ఆదర్శంగా కనిపించే నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి ఒక్కడే. అటువంటి నాయకుడికి ఓటు హక్కుతో అండగా నిలుస్తాం. ప్రజలకు మరింత చేరువవ్వాలనే ఫ్యాను గుర్తును తలకు కట్టుకున్నా.

– ఏలూరి చంద్ర శేఖర్, చిట్టవరం

వైఎస్సార్‌కు తగ్గ తనయుడు



చనిపోయి ఏ లోకాన ఉన్నాడో.. ప్రజల కోసం ఎప్పుడూ పరితపించిన దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డికి తగ్గ తనయుడిగా జగన్ బాబు మా అందరి హృదయాలను గెలిచేలా పరిపాలన అందిస్తున్నాడు. మాకు ఏదైతే చెయ్యగలడో అదే చెప్పి దాన్ని నూరుశాతం అమలు చేసిన ఏకైక నాయకుడు జగన్‌బాబే. జగన్‌ను చూడడానికే తీరప్రాంత గ్రామమైన వేములదీవి నుంచి వచ్చాము.

– తిరుమాని విజయలక్ష్మి, వేములదీవి

మత్స్యకారులకు జగనే భరోసా



మత్స్యకారులకు ఎంతో భరోసా కల్పించిన నాయకుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రమే. అమలుకాని హామీలను ఇచ్చి మోసం చేయాలనే ఉద్దేశం లేదు కాబట్టే ఏ పథకం ఇస్తాడో అదే చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పథకాలను అమలు చేసి చూపించాడు. అంతే కాకుండా మా ఊరి దగ్గర్లో హార్బర్ కడతారని అంటున్నారు. దానివల్ల మా జీవితాలు మరింత పెరుగుతాయని మా వాళ్లంతా అనుకుంటున్నారు.

– తిరుమాని లక్ష్మి, రామాంజనేయపురం

ఆసుపత్రులు ఎంత బాగుపడ్డాయో..



నరసాపురంలో ప్రభుత్వ ఆసుపత్రిని తీర్చిదిద్దడం వల్లే ఈరోజు మెరుగైన వైద్యం అందుతుంది. నాకు పక్షవాతం వచ్చినప్పుడు ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లే స్థోమత లేకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రికే వెళ్లాను. అక్కడ అందించిన సేవలతోనే నేను బతికి బయటపడ్డా. అందుకే ఈ రోజు జగనన్నను చూడడానికి రాగలిగాను. ఆసుపత్రులు, విద్యా సంస్థలు ఎంత బాగు**పడ్డాయో వాటిని ఉపయోగించుకున్న నాలాం** టి వారికే తెలుస్తుంది.

– కొల్లాటి చిన్న, ఎల్‌టీ చర్ల



జగనన్న మా ఆరాధ్య దైవం

కాపుల ఆరాధ్యదైవం వంగవీటి మోహన్‌రంగా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రసాదరాజు కలిసి ఉన్న ఫ్లెక్సీతో పట్టణానికి చెందిన మణికంఠ అనే యువకుడు తన మిత్రులతో కలిసి సందడి చేశాడు. దిస్ టైమ్ 175 టార్గెట్ అంటూ పట్టణ పుర వీధుల్లో యువకులు కేరింతలు కొడుతూ ఊరేగింపు నిర్వహించారు. జగనన్న మా ఆరాధ్య దైవం అంటూ నినాదాలు చేశారు.

మణికంఠ, నరసాపురం



ఉప్పొంగిన అభిమానం

తీరప్రాంతం జగనాభిమానంతో ఉప్పొంగింది. పథకాలతో తమ జీవితాలను నిలబెట్టిన సంక్షేమ సారథిని చూసేందుకు అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు కుటుంబ సమేతంగా తరలివచ్చారు. మండుటెండను సైతం లెక్కజేయకపోవడం విశేషం. అవినీతి, సిఫార్సులు అంటూ ఏమీ లేకుండా కుల, మత, వర్గ భేదాలు చూడకుండా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించిన మా జగనన్న అంటూ ప్రజలు గర్వంగా చెప్పుకుంటున్నారు. మా ఓట్లను ఫ్యాన్ గుర్తుకు వేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటాం.. చంద్రబాబు కూటమిని తరిమికొడతాం అంటూ నినదించారు.

– పాలకొల్లు సెంట్రల్, నరసాపురం రూరల్



నరసాపురంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు హాజరైన అభిమాన గణం

మళ్లీ జగనన్ననే గెలిపించుకుంటాం

మా అమ్మమ్మకు పెన్షన్ వస్తుంది. జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత వలంటీర్లు ఇంటికి వచ్చి పెన్షన్లు అందించడం చాలా బాగుంది. గత రెండు నెలలుగా చంద్రబాబు కాలం నాటి పెన్షన్ కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. పెన్షన్ కోసం బ్యాంక్‌కు వెళితే ఇంకా పడలేదని అంటున్నారు. మళ్లీ జగనన్ననే గెలిపించుకుంటాము. జగనన్నను చూసేందుకు కుటుంబ సమేతంగా వచ్చాము.

– వేదంగి మణికుమారి, ఆకర్తిపాలెం



జగనన్నను చూసిన ఆనందంలో..

చంద్రబాబు పేదలకు నరకం చూపించాడు



చంద్రబాబు హయాంలో మాలాంటి పేదలకు నరకం చూపించాడు. కనీసం తాగడానికి నీళ్లు కూడా దొరికేవి కాదు. ఎక్కడికో వెళ్లి నీళ్లు తెచ్చుకునే పరిస్థితి ఉండేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తరువాత పల్లెల రూపురేఖలు మారిపోయాయి. అన్నీ అందుబాటులోకి వచ్చాయి. వలంటీర్ ఇంటికి వచ్చి అన్ని పథకాలు అందిస్తున్నారు. అవి చూసి ఓర్వలేకనే చంద్రబాబు కూటమి సభ్యులు అడ్డుపడుతున్నారు.

– ఓడుగు మీరాసాహెబ్, సర్దుకొడప

పేదల బతుకులు బాగుపడాలంటే..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలన్నీ అందుతున్నాయి. నా భార్యకు వైఎస్సార్ చేయూత, మనవడికి అమ్మఒడి, డ్వాక్రా రుణమాఫీ అందాయి. ఇచ్చిన హామీలు ఖచ్చితంగా అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. పేదల బతుకులు బాగుపడాలంటే మళ్లీ జగనే సీఎం కావాలి.

– సిర్రా చంద్రరావు, లిఖితపూడి

మహిళలకు ఆర్థిక భరోసా



మా పిల్లలకు అమ్మఒడి వచ్చింది. మాకు డ్వాక్రా రుణమాఫీ పడింది. మా మామగారికి పెన్షన్ వస్తుంది. మంచి పథకాలు అందిస్తున్నారు. మహిళలు ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడడానికి చేదోడు, చేయూత ఇచ్చి మహిళలకు ఆర్థిక భరోసా కల్పించారు. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అయితే మా జీవితాల్లో మరింత వెలుగులు వస్తాయని ఆశిస్తున్నాము.

– గుత్తుల బేబిసరోజ, ఎల్‌బీ చర్ల

జగన్ అంటే అందరికీ అభిమానం



మళ్లీ జగన్ సీఎం అవుతారు. మండుటెండలో సైతం జగన్‌ను చూసేందుకు ప్రజలు వేచి చూస్తున్నారంటే నిదర్శనం అదే. ప్రతి ఒక్కరి కుటుంబంలో మేలు జరగడం వల్లే ఆయనంటే నాతో పాటు ప్రతి ఒక్కరికీ చెప్పలేని అభిమానం. నాకు రైతు భరోసా డబ్బులు పడుతున్నాయి. ఇంట్లో డ్వాక్రా రుణమాఫీ, సున్నా వడ్డీ అందింది. మా అమ్మాయి వలంటీర్‌గా కూడా చేస్తుంది.

– పెదపాటి శ్రీనివాసరావు, గొంది

సొంతింటి కల నెరవేరింది



నాకు ఇంటి స్థలం వచ్చింది. సొంతింటి కల నెరవేరడంతో చాలా ఆనందంగా ఉంది. ఇచ్చిన మాటను అమలు చేసే సత్తా ఉన్న నాయకుడు జగన్. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నారని తెలిసి ఆయన్ను చూసేందుకు ఉదయాన్నే సభావేదిక వద్దకు **వచ్చాను. మళ్లీ ఆయనే సీఎం అవ్వాలి. ఫ్యాన్ గుర్తుకే ఓటు** వేయాలని **నాకు తెలిసినవారందరికీ చెబుతున్నాను.**

– **పిట్టా** యోహాన్, సరిపల్లి

ఆర్థికంగా నిలదొక్కుకున్నాం



జగనన్న రాకతో మహిళల జీవితాలు ఎంతో మెరుగుపడ్డాయి. ప్రతి సంవత్సరం చేయూత పథకం ద్వారా వేస్తున్న డబ్బులు, రైతు భరోసా, అమ్మఒడి పథకాలతో ఆర్థికంగా ఎంతో నిలదొక్కుకున్నాం. ఇది నా మాట మాత్రమే కాదు.. నియోజకవర్గంలోని పేద బడుగు బలహీన వర్గాల అందరి మాట. జగన్‌బాబును చూడడం చాలా సంతోషంగా ఉంది.

– గొల్ల శాంతకుమారి, చిట్టవరం

'దేశం' వసూళ్ల పర్వం

- ప్రతి వ్యాపారీ ఎన్నికల ఫండ్ ఇవ్వాల్సిందే
- ఏలూరు క్లబ్‌లో పేకాట మొదలు పెట్టడానికి ప్రత్యేక రేటు
- గోల్డ్ షాపుల రోడ్డు విస్తరణ చేయకుండా యూనియన్ ద్వారా ఓ ప్యాకేజీ
- నగరంలోని హాస్పిటల్స్ అన్నీ కలిపి ఒక ప్యాకేజీ
- సాయమంటూ ఫోన్ చేసి పరోక్ష బెదిరింపులు
- మున్సిపల్ కాంప్లెక్స్‌లోని షాపులకూ ఓ రేటు
- ఏలూరు టీడీపీ అభ్యర్థి చందా.. దందా
- కలెక్షన్ టార్గెట్ రూ.10 కోట్లు
- ఇప్పటికే సింహభాగం పూర్తి

చందా.. దందాలు



సాక్షి ప్రతినిధి, ఏలూరు : చందాల దందాకు ఏలూరు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి తెరలేపారు. అభిమానంతో,ఇష్టంతో తీసుకుంటే చందాలు కాని, సాయం అంటూ ఫోన్ చేసి పరోక్ష బెదిరింపులు, అధికారం వస్తే అడ్డగోలుగా పనులు చేస్తానని ఎన్నికల హామీల్లాగా మాటలతో చిరు వ్యాపారులు మొదలు వైద్యుల వరకు ఏ ఒక్కరినీ వదలడం లేదు. ప్రత్యేకంగా విభాగాల వారీగా లిస్టులు రెడీ చేసి బుకీలు, రౌడీషీటర్లు, పెద్ద మనుషుల ముసుగులో ఉన్న కలెక్షన్ రాజాలకు వసూళ్ల బాధ్యతను పురమాయించారు. గత నాలుగు రోజులుగా ఏలూరు నగరంలో స్పెషల్ డ్రైవ్ తరహాలో వసూళ్ల పర్వం సాగడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల ఫండ్ టార్గెట్ రూ.10 కోట్లుగా నిర్దేశించి సింహభాగం వసూళ్లు చేసినట్టు సమాచారం.

బెదిరించి.. వసూళ్లకు తెరతీసి..

ఏలూరు టీడీపీ నేతలు ఎన్నికల ప్రచారం కంటే వసూళ్ల పర్వంలోనే బిజీగా ఉన్నారు. నగరంలోని పెద్ద మనుషులకు పోటీ చేస్తున్న నేత, మిగిలిన వారికి అసోసియేషన్లు డీల్ చేసే నేతలు వసూళ్లు మొదలుపెట్టారు. ప్రస్తుతం ఏలూరు నగరంలో సాగుతున్న వసూళ్ల వ్యవహారం జిల్లా టీడీపీలో హాట్ టాపిక్‌గా మారిందంటేనే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అభిమానం**తో కాకుండా పరోక్ష బెదిరింపులతో** ఎమ్మెల్యే అయ్యాక చేసే పనుల పేర్లు చెప్పి ముందస్తు వసూళ్లకు తెగబడుతున్నారు. మెయిన్ బజారులోని చందనా బ్రదర్స్ ఎదురుగా ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్‌లో ప్రతి షాపు నుంచీ వసూళ్లకు తెరతీశారు. ఆ బాధ్యత కూడా ఆ షాపుల్లో ఒక షాపు యజమానికే పురమాయించారు. 33 శాతం లీజ్ పెంచకుండా షాపుల అద్దెలు ఎమ్మెల్యే అయ్యాక తగ్గిస్తామనే హామీతో కనీసం రూ.20 వేలు.. అత్యధికంగా రూ.లక్ష వరకు వసూళ్లకు తెరతీశారు. అలా ఒక కాంప్లెక్స్‌లోనే 30కి పైగా షాపులున్నాయి.

బంగారం వ్యాపారుల నుంచి..

ఏలూరు నగరంలోని కన్నయ్య పార్కు నుంచి గడియార స్తంభం వరకు వందల సంఖ్యలో బంగారం దుకాణాలున్నాయి. రోడ్డు విస్తరణ చేస్తే బంగారం దుకాణాలన్నీ ఎగిరిపోయి వ్యాపారం రోడ్డున పడుతుంది. విస్తరణ ప్రతిపాదనలు రాకుండా చూసుకోవడంతో పాటు వ్యాపారాలన్నింటికీ సహాయంగా మన నాయకుడు ఉంటాడు, అందరూ మాట్లాడి భారీగా కోట్లల్లో ఒక అంకె అనుకుని తెచ్చి ఇవ్వండి అని పరోక్ష బెదిరింపులు పలికి కొంత మేరకు వసూళ్లు చేశారు. ఈ వసూళ్ల వ్యవహారమంతా క్రికెట్ కమ్ పొలిటికల్ బుకీగా ఉన్న చోటా నేత చూసుకుంటున్నాడు.

వైద్యుల నుంచి

ఏలూరు నగరంలోని 70కి పైగా ఉన్న హాస్పిటల్స్‌లోని వైద్యులకు ఫోన్లు వచ్చాయి. నేతకు ఎన్నికల ఖర్చులుంటాయి, ఐదేళ్లు కరోనా వల్ల మీరందరూ బాగా బాగుపడ్డారు, మా సంగతి కూడా చూసుకుని మంచి ఫ్యాన్సీ అమౌంట్ ఫండ్‌గా ఇవ్వండి అంటూ చెప్పి సగం మేర వసూళ్లు చేసేశారు. ఈ వ్యవహారమంతా సదరు నేత క్యాంపులో సీనియర్ పేకాట ప్లేయర్‌గా ఉన్న వ్యక్తికి అప్పజెప్పారు. అలాగే నగరంలోని క్షత్రియ సామాజికవర్గంలో ప్రముఖుల నుంచి వసూళ్ళ చేసే బాధ్యత, అదే సామాజికవర్గానికి చెందిన ఓ వ్యక్తికి అప్పగించారు.

క్లబ్‌కు.. బిగ్ టార్గెట్

ఏలూరు టౌన్‌హాలుకు ఘన చరిత్ర ఉంది. పేకాట పలు ఏళ్లపాటు పెద్ద ఎత్తున సాగింది. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక క్లబ్‌లో పేకాట పూర్తిగా మూతపడి రిక్రియేషన్‌కు మాత్రమే పరిమితమైంది. **ఏళ్ల తరబడి నుంచి క్లబ్‌లో పేకాటకు అలవాటుపడిన పెద్ద మనుషులంతా తలోబాట పట్టి వేరే ప్రాంతాలకు వెళ్లి మరీ పేకాడుతున్న పరిస్థితి. ఈ క్రమంలో క్లబ్‌లోని పెద్ద మనుషులు చంద్రబాబు సొంత సామాజికవర్గ ముఖ్యులందరికీ ఫోన్లు చేసి పేకాట ప్లేయర్లు అందరూ కలిసి రూ.4 కోట్లకు తక్కువ లేకుండా భారీగా ఇవ్వాలని, దానికి నజరానాగా ఎమ్మెల్యే కాగానే మొదటి రోజే క్లబ్‌లో పేకాట మొదలుపెడదామని చెప్పి అత్యధిక వసూళ్లు పూర్తి చేశారు. ఈ వ్యవహారం మొత్తం క్లబ్‌లో క్రియాశీల**కంగా ఉన్న ప్లేయర్ పర్యవేక్షిస్తున్నారు. ఇక షాపింగ్ మాల్స్, ఇతర వ్యాపార సముదాయాలు లెక్కే లేదు. అనుచరగణంగా ఉన్న బెట్టింగ్‌రాయుళ్లు, రౌడీషీటర్లు తలోదారిలో వసూళ్ల పర్వం కొనసాగిస్తున్నారు. మొత్తం మీద ఎన్నికల పుణ్యమా అని కలెక్షన్స్ బాగా నడుస్తున్నట్లు కోటరీ టాక్.